నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలలో లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డిఆర్‌ఒ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికే పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మార్కెట్‌లో మండీదారుల సిండికేట్‌కు స్వస్తి

ఇనామ్‌తో చీనీ కొనుగోలుకు శ్రీకారం
నేటి నుంచి పులివెందులలో అమలు

ప్రజాశక్తి-సింహాద్రిపురం

పులివెందుల మార్కెట్ యార్డులో రెండేళ్ల కిందట చీనీ కాయల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పులివెందుల ప్రాంతంలో తోటలు అధికంగా ఉండడంతో రైతులకు సుల భతరంగా విక్రయించుకునేందుకు వీలుగా చీనీ కాయలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే ఈ మార్కెట్ యార్డులో బహిరంగ వేలంతో కాయలను కొనుగోలు చేసేవారు. ఈ విధానం వల్ల అక్కడే ఉన్న మండీదారులు సిండికేట్ అయి రైతులకు మంచి ధరలు ఇవ్వడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెలలో స్వచ్ఛందంగా రైతులు మార్కెట్ యార్డ్ వద్దకు వచ్చి సరైన ధరలు వేయడం లేదని, వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆందోళన చేశారు. దీంతో కలెక్టర్ శ్రీధర్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇనామ్ విధానంలో చీనీ కాయలు కొనుగోలు చేయాలని, దీని వల్ల దేశంలోని వ్యాపారులు ఆన్‌లైన్ విధానంలో కొనుగోలు చేయడంతో మంచి ధరలు వస్తాయని సూచించారు. ఇనామ్ అంటే జాతీయ వ్యవసాయ మార్కెట్ అనేది భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్. దీని ద్వారా రైతులు తమ పంటలను దేశవ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులకు విక్రయిస్తారు. ఈ విధా నంలో రైతులు ఇనామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, తమ ఉత్పత్తులను నమోదు చేస్తారు. అలాగే కొనుగోలుదారులు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ చేసి కొనుగోలు చేస్తారు. దీనివల్ల రైతులకు మంచి ధర లభించడంతో పాటు కొనుగోలుదారులకు విస్తృత మార్కెట్ అందు బాటులోకి వస్తుందని ఈ వెబ్‌సైట్ వివరిస్తుంది. రైతులు ఇనామ్ వెబ్‌సైట్ (ఇనామ్ ఎన్.జీఒవి.ఇన్)లో ఫార్మర్‌ను ఎంచుకుని తమ ఇమెయిల్ ఐడితో నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న తర్వాత, ఇమెయిల్‌కు తాత్కాలిక లాగిన్ ఐడి, పాస్‌వర్డ్ వస్తాయి. ఈ లాగిన్‌తో డాష్‌బోర్డ్‌లోకి వెళ్లి, వారు నమోదు చేసుకున్న ఏపిఎంసిలో రిజిస్టర్ అవ్వాలి. అప్పుడు ఏపిఎంసి ద్వారా కెవైసి పూర్తయిన తరువాత ఏపిఎంసి వారి అప్లికేషన్‌ను ఆమోదిస్తారు. తర్వాత, రైతులు వారి శాశ్వత ఇ-నామ్ లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌ను అందుకుంటారు. లాగిన్ ద్వారా, రైతులు తమ ఉత్ప త్తులను జాబితా చేయవచ్చు. అలాగే కొనుగోలుదారులు ఆన్ లైన్‌లో బిడ్డింగ్ చేయ వచ్చు. ఈ విధానం వల్ల రైతులకు దేశవ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులతో వ్యా పారం చేసే అవకాశం లభి స్తుంది. దీనివల్ల మంచి ధరలు లభించే అవకాశం ఉంది. అదేవిధంగా కొనుగోలుదారులు రైతులకు వారి బ్యాంకు ఖాతాలో ప్రత్యక్ష చెల్లింపు జరుగుతుంది. కొనుగోలు దారుకు మధ్యవర్తిత్వం తగ్గడం వల్ల లావాదేవీల ఖర్చులు తగ్గుతాయి. మార్కెట్లోని మండీదా రులందరూ సిండికేట్‌గా మారి తక్కువ ధరలు వేలంపాటలో వేలం వేసేవారు. దీనివల్ల నష్టపోవడం జరుగుతుండేది.

పులివెందుల మార్కెట్లో కొనుగోలు చేస్తున్న చీనీ కాయలు

మండీదారులతో నష్టపోయాం

మార్కెట్లోని మండీదారులందరూ సిండికేట్‌గా మారి తక్కువ ధరలకు వేలంపాటలో వేలం వేసేవారు. దీనివల్ల నష్టపోవడం జరుగుతుండేది. కొత్త విధానంతోనైనా రైతులకు మంచి ధరలు కల్పించాలి.

-రామ్మోహన్ రెడ్డి, చీనీ రైతు, గురజాల.

వ్యాపారులు ఎక్కువమంది పాల్గొనే అవకాశం

ఇనామ్ విధానం ద్వారా మార్కెట్ యార్డులో చీనీ కొనుగోలు ప్రారంభిస్తున్నాం. దీనివల్ల భారతదేశంలోని వ్యాపారులు అందరూ పాల్గొనే అవకాశం ఉంటుంది. దీ వ్యాపారులకు డిమాండ్ మేరకు ఆన్‌లైన్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. చెల్లింపులు సైతం నేరుగా రైతు ఖాతాలోనే జమ చేయడం జరుగుతుంది.

- శ్రీధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ, పులివెందుల.

వైద్య విద్య ప్రయివేటీకరణ ప్రమాదకరం

- వెంటనే 590 జిఒను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రభుత్వ వైద్య విద్యను ప్రయివేటీకరించడం ప్రమాదకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం వైఎస్ బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ శివయ్య యాదవ్, శివరాం, బసయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 14 నెలలుగా రాష్ట్రంలో కొలువుతీరిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం కొన్ని పాలసీలను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. అంబానీ, అదానీ, హిందూజా టెక్, లులూ, ఉప లాంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్, బడా పారిశ్రామిక ప్రయివేట్ సంస్థలకు, ప్రజల ఉమ్మడి సహజ సంపదలన్నిటిని ఉచితంగానూ, కారు చౌకగానూ అప్పగిస్తున్నారని చెప్పారు. పి -4 పాలసీను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం జీవో నంబర్ 108 ద్వారా 17 మెడికల్ కళాశాలలు, ఐదువేల వైద్య కళాశాల సీట్లు, 70 శాతం ఫ్రీ సీట్లు, 30శాతం పేమెంట్ సీట్లు, బిసి, కేటగిరిలో ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 590 జిఒ ద్వారా, 17 మెడికల్ కళాశాలలో 9 మెడికల్ కళాశాలలు పి-4 కింద ప్రయివేటీకరణ చేస్తున్నారని చెప్పారు. ఇది సామాన్య, పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయడమే అన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం అన్నారు. రాష్ట్రంలో 1లక్ష 6 వేల ప్రభుత్వ ఉద్యోగాలు వైద్యరంగంలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ప్రకటించారు, ఈ 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేస్తే, కనీసం 20 వేల ఉద్యోగాలు భర్తీ అయ్యేవని ఆయన గుర్తు చేశారు. కక్షపూరిత రాజకీయాలు పక్కన పెట్టి విద్య, వైద్యం సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రాయలసీమ ఆకాంక్షల వేదిక నాయకులు రఘునాథరెడ్డి, బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు కుమార్ స్వామి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు రెడ్డి, ఎస్సి, ఎస్టి ఉద్యోగుల సంఘం నాయకులు పి.వి.రమణ, మైనార్టీ నాయకులు అమీర్ హుస్సేన్, భారతరత్న కర్పూరి ఠాగూర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పి.వెంకటరమణ, బిసి సంఘం సీనియర్ నాయకులు అవ్వారు మల్లికార్జున, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు సంగటి మనోహర్, రజక సంఘం నాయకులు నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, బిసి నాయకులు శ్రీనివాసులు, చైతన్యమండలి నాయకులు సుబ్బారావు, సీనియర్ న్యాయవాదులు సంపత్ కుమార్ మాట్లాడారు.

అగ్రశ్రేణి జాబితాలో వైవీయూ ప్రొఫెసర్లు

ప్రజాశక్తి కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు ప్రొఫెసర్లు ప్రపంచంలోని అగ్రశ్రేణి శాస్త్రవేత్తల జాబితాలో నిలిచారు. మెటీరియల్ సైన్స్ నానోటెక్నాలజి విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎం. వి. శంకర్, మైక్రోబయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎల్. వీరాంజనేయ రెడ్డి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రచురించిన అత్యుత్తమ శాస్త్రవేత్త డేటా, 2025 ఎడిషన్‌లో చోటు సంపాదించారు. అలానే యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కూడా ప్రపంచ టాప్ 2శాతం జాబితాలో ఉన్నారు. తనతోపాటు విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్లు పరిశోధనలో టాప్2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో నిలవడం అభినంద నీయమని, విశ్వవిద్యాలయ విద్యా పరిశోధన ప్రగతికి దర్పణం అని పేర్కొన్నారు. ఈ ప్రగతి రానున్న న్యాక్ గుర్తింపునకు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ర్యాంకుకు దోహదకారి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని విసి తోపాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అభినందించారు.

వర్షపు నీటిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వర్షపు నీటి సమస్యను పరిష్కరించండి
ప్రజాశక్తి - కడప అర్బన్

48వ డివిజన్‌లోని లోహియా నగర్ ప్రాంతంలో ఉన్న పరమేశ్వరస్కూల్ వీధిలో వర్షపు నీరు మోకాలు లోతు నిలబడి ఉందని, నగరపాలక యంత్రంగం తక్షణమే ఆ నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం 48వ డివిజన్‌లో ఉన్న లోహియా నగర్ ప్రాంతాన్ని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్‌తో పాటు ఆ పార్టీ నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రయివేట్ స్కూలు, హోమియోపతి కళాశాల నుంచి నిరంతరం విద్యార్థుల రాకపోకలు చేస్తూ ఉంటారని తెలిపారు. పైగా నిత్యం ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, వృద్ధులు నిరంతరం సంచరించే ప్రాంతమని వారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి రోడ్డును ఎత్తు లేపాలని డిమాండ్ చేశారు. వర్షపు నీరు మోకాలు లోతు నిలబడటం వల్ల వృద్ధులు కింద పడడం గాయాల పాలవడం లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో పేరుకుపోయిన డ్రెయినేజీని తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నేడు కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగర శివారు ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి లే అవుట్‌లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వాటి పరిష్కారానికి అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 22న కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెర్లోపల్లి లే అవుట్‌లో తూర్పు వైపు ఉన్న కాలనీకి రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంకా శ్మశానం, విద్యుత్, డ్రెయినేజీ, మంచి నీటి సమస్య పరిష్క రించాలని పేర్కొన్నారు. ఆందోళన కార్యక్రమంలో చెర్లోపల్లి లే అవుట్‌లో ఉన్న ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ పరిశోధనకు పేటెంట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం జన్యు శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముని కుమారి, పరిశోధక విద్యార్థి షేక్.బాబుల్లాకు పేటెంట్ లభించింది. వీరు ప్రయోగాత్మకంగా మొక్కల ఎదుగుదలకు అవసరమైన సూక్ష్మపోషక మిశ్రమాన్ని నానో కణాలు ఉపయోగించి కొత్త ఫార్ములా అభివృద్ధి చేసినందుకు ఇండియన్ పేటెంట్‌ను పొందారు. ఈ సందర్భంగా విసి ఆచార్య అల్లం శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ఐ.క్యు.ఎ.సి డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభోష్ చంద్ర, సహచర అధ్యాపకులు, స్కాలర్లు అభినందించారు.

ఓటు చోర్ గద్దీ చోడ్.. మహా ఉద్యమం
కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఓటు చోర్ గద్దీ చోడ్ మహా ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. ఆదివారం అల్మాస్‌పేట సర్కిల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితా అవకతవకలను నిర్మూలించేందుకు, భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఓటు చోర్ గద్దీ చోడ్ మహా ఉద్యమం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఓట్ చోర్ గద్ది చోడ్ – సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా డివిజన్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలతో కలిసి కడప సిటీ పరిధిలో సంతకాల సేకరణకు ప్రారంభోత్సవం చేశామన్నారు. 'ఓటు చోర్ గద్దీ చోర్' అనేది కేవలం ఒక నినాదం కాదు అది దేశ ప్రజల మనోభావం అన్నారు. దేశమంతా ప్రతిధ్వనిస్తున్న నిజం అన్నారు. చిన్న పల్లె నుంచి పెద్ద నగరం వరకు వినిపిస్తున్న నినాదం అన్నారు. తమ ప్రాథమిక హక్కును హరించారని భావిస్తున్న ప్రజల ఆక్రోశం ఇదన్నారు 'ఓట్లను తొలగించి, నకిలీ ఓటర్లను చేర్చడానికి నిర్మించబడిన మోడల్ అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ హమీద్, దాసరి శ్రీనివాసులు, సలీం, ఫజలుల్లా, గంగయ్య, రఫిక్ ఖాన్, అబ్దుల్ రౌఫ్, మొయిన్, ముబారక్, సిద్ధిక్, షామీర్ హుస్సేన్, యూసఫ్, సర్దారి, తదితర నాయకులు, డివిజన్ ఇన్చార్జులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు గౌస్‌పీర్

గురజాడ దేశ భవితకు అడుగుజాడ : యుటిఎఫ్
ప్రజాశక్తి - కడప అర్బన్

గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవన్ లో గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ గురజాడ అడుగుజాడ దేశ భవితకు వెలుగు జాడని, ఆయన తెలిపిన దేశభక్తి నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. 1910వ సంవత్సరంలో ఆయన రాసిన దేశభక్తి కవిత నేటికి కూడా అనుసరణీయంగా ఉందని చెప్పారు. దేశమంటే నదులు, పర్వతాలు, సముద్రాలు,భౌగోళిక స్వరూపం కాదని సర్వ సమానత్వం కలిగి, మనుషులంతా సమాన అవకాశాలతో సౌఖ్యంగా జీవించడం అని పేర్కొన్నారు. గురజాడ దేశభక్తి మానవ శ్రమను కీర్తిస్తుందని, అందరూ కష్టపడి పని చేయడం,అందరికీ కడుపునిండా తిండి కల్పించడమే నిజమైన దేశభక్తి అవుతుందని, కార్మిక, కర్షక వర్గాన్ని దోపిడీ చేస్తూ వారి రెక్కల కష్టాన్ని దోచుకు తినే సమాజం నశించాలని తెలిపారు. గురజాడ దృష్టిలో దేశభక్తి అంటే తనకోసం తాను బతుకుతూ తన చుట్టూ ఉన్న వారి శ్రేయస్సు కోసం పాటుపడాలని సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడ్పడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తం,గురు మోహన్, గోపీనాథ్, సుబ్బారావు,వరప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ వీర నాగేంద్రకు మొదటి బహుమతి
ప్రజాశక్తి - కడప

బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రభుత్వ పురుషుల కళాశాల కడప జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ సమర్పించిన వివిధ రకాల కేన్సర్లకు చికిత్స చేయడానికి 'కర్కుమిన్, దాని నానోఫార్ములేషన్ల సంభావ్య పాత్ర' అనే పరిశోధక అంశానికి గాను మొదటి బహుమతి లభించింది. ఈ అవార్డును యూనివర్సిటీ కేలటన్ మలేషియా మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాటో ఇబ్రహీం చె ఒమర్, ప్రొఫెసర్ అలోయ్షియస్ మా. ఎ. మారనన్, సాన్ బేడా యూనివర్సిటీ ఫిలిప్పీన్స్ వారు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, అకాడమిక్ కో – ఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ సత్య నారాయణరెడ్డి, డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నీలయ్య, డాక్టర్ రవి శేఖర్, అధ్యాపకులు అభినందించారు.

కడప నగరంలో ముస్లిముల నిరసన ర్యాలీ
ప్రజాశక్తి - కడప

ర్యాలీలో మైనార్టీ నాయకులు

కడప నగరంలోని ఏడూ రోడ్ల కూడలిలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన కార్య క్రమం చేపట్టారు. ఐలవ్ మొహమ్మద్ అనే 150 అడుగుల బ్యానర్‌తో నిరసన చేపట్టారు, అలాగే ప్లే కార్డులను ప్రదర్శించారు. మిలాద్–ఉన్–నబి వేడుకల్లో భాగంగా ఉత్తర్ ప్రదేశ్‌లో ఐలవ్ మొహమ్మద్ అని బ్యానర్లను ముస్లిం యువకులు ప్రదర్శిం చడంతో అక్కడి యోగి ప్రభుత్వం పోలీసులు అక్రమంగా ముస్లిం యువ కులపై కేసులు నమోదు చేసినందుకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేప ట్టారు. దేశంలో ముస్లిములపై ఏదో ఒక రూపంలో దాడి చేసినందుకు బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ తదితర మత చాందస్తవాదులు కుట్ర పన్నుతున్నారని, దీన్ని ముస్లిములు తిప్పికొడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘ సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

కార్మికుల పని గంటలు పెంచడం దారుణం
ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మికుల పని గంటలు పెంచి వారి శ్రమను దోచుకుంటున్న యాజమాన్యానికి అనుకూలంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రక టనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈనెల 19న అసెంబ్లీలో పెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలని సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఆందోళన నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళలు రాత్రి వేళల్లో , 13 గంటలు పనిచేయాలని చట్టం చేయడం దుర్మార్గమన్నారు.

నాణ్యమైన వైద్య సేవలకు పెద్దపీట

- బద్వేల్‌లో డయాలసిస్ సేవలకు శ్రీకారం
- డిసిహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్ వై.హిమదేవి వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో కమ్యూనిటీ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించడంపై దృష్టి సారించాం. జిల్లాలోని ఏడు సిహెచ్‌సి కేంద్రాల్లో జ్వరాల పీడితులకు సత్వరమే చికిత్సలు అందించడం జరుగుతోంది. రీస్ట్రక్చరింగ్ పాలసీ ద్వారా స్పెషలిస్టుల నియామకాలను చేపట్టాం. గుండెపోటు లక్షణాలు కలిగిన రోగులకు రూ.45 వేలు విలువ కలిగిన త్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాపాయం నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. గుండెపోటు వైద్యంతోపాటు ఇతర వైద్యసేవల్లో డయాగ్నోసిస్‌కు సంబంధించిన ఎంఆర్ఐ, సిటి, టిఫాస్కాన్, అల్ట్రాసౌండ్ సహా అత్యాధునిక లూనార్ ఆపరేషన్ థియేటర్ల సదుపాయాలను అందు బాటులోకి తెచ్చామని పేర్కొంటున్న సందర్భంగా డిసిహెచ్‌ఎస్ జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ వై. హిమదేవితో ముఖాముఖి...

ముఖా ముఖి..

సిహెచ్‌సి ఆస్పత్రులు ఎన్ని?

ఉమ్మడి జిల్లా పరిధిలో 13 సిహెచ్‌సి ఆస్పత్రులు ఉన్నాయి. వీటితోపాటు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. ఇందులో సుమారు 24 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచడమైంది.

వైద్య సేవల తీరుతెన్నుల్ని వివరించండి?

జిల్లాలోని కమ్యూనిటీ ఆస్పత్రులను మెరుగైన వైద్యసేవలకు చిరునామాగా నిలిపాం. గతంలో కమ్యూనిటీ ఆస్పత్రులు బి, సి గ్రేడ్ కేటగిరీలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన కేటగిరీల్లో సి కేటగిరీ సేవలు కలిగిన ఆస్పత్రి ఒక్కటి కూడా లేకపోవడం పని తీరుకు నిదర్శనంగా బావించొచ్చు. భవిష్యత్‌లో ఉత్తమ పని తీరును కన బరచడం ద్వారా ఎ గ్రేడ్ కేటగిరీ ఆస్పత్రుల సంఖ్యను పెంచడంపై దృష్టి సారించాం.

హృద్రోగుల చికిత్సను వివరించండి?

గుండెపోటు రోగులకు త్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను ఇస్తాం. ఇప్పటి వరకు 60పైగా ఇంజెక్షన్లు ఇవ్వడమైంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన గ్రామీణులు గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సిలను సంప్రదించాలి. జిల్లా కేంద్రంలోని నిష్ణాతులైన వైద్యుల సహకారంతో సేవలు అందిస్తాం. వైద్యనిపుణుల సూచనల సహాయంతో రూ.45 వేల విలువ కలిగిన టెన్క్టిపైప్లేస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

కార్డియాలజీ పరికరాల ఏర్పాటుపై మీరేమంటారు?

జిల్లాలోని తొమ్మిది సిహెచ్‌సిల్లో ట్వెల్వ్‌లీడ్ ఇసిజిలు, డీఫిబ్రి లేటర్స్, సంబంధిత ఇంజెక్షన్లు, మందులను అందుబాటులోకి ఉంచాం. జిల్లాకు 16 సెల్‌ఫోన్స్ పంపిణీ చేశామని తెలిపారు. హృద్రోగ లక్షణాల బారిన పడిన రోగులు కలిగిన సిహెచ్‌సిల నుంచి కార్డియాలజీ వైద్య నిపు ణుల సెల్‌ఫోన్స్‌కు మోగుతూనే ఉంటుంది. ఈమేరకు వైద్య సిబ్బందికి శిక్షణను సైతం పూర్తి చేశాం.

ఓపి సేవల వివరాలు తెలపండి?

ప్రతినెలా 1.24 లక్షలపైగా ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలు అందుతున్నాయి. రాయచోటిలో 135 శాతం నుంచి కనిష్టంగా సిద్ధవటంలో 70 శాతం వరకు మెరుగైన సేవలు అందించడం జరుగుతోంది. వీటితోపాటు సుమారు 24 రకాల ల్యాబ్, ఎక్స్‌రే సేవలు అందుబాటులో ఉంచడమైంది.

ఐపి సేవల గురించి చెప్పండి?

డిసిహెచ్‌ఎస్ పరిధిలో సుమారు 12 వేల మంది ఇన్‌పేషెంట్ రోగులు ఉన్నారు. ఇందులో బద్వేల్ సిహెచ్‌సిలో గరిష్టంగా 125 శాతం నుంచి కనిష్టంగా జమ్మలమడుగులో సిహెచ్‌సిలో 49.4 ఆపరేషన్స్, ఎఫ్ ఎస్ డెలివరీస్, లాబ్‌టెస్ట్‌ల సంఖ్య అమాంతంగా పెరిగింది.

ఆధునిక వైద్యసేవలను వివరించండి?

హైరిస్క్ గర్భిణులు, అనీమియా రోగులకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తేవడమైంది. అనీమియా రోగులకు ఐరన్, సుక్రోస్ ఇంజెక్షన్స్, బ్లడ్‌ట్రాన్స్‌ఫర్మేషన్ సదుపాయాలు ఉన్నాయి. సిజేరియన్ ఆపరేషన్స్, డెలివరీస్ నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, లూ నార్ ఆపరేషన్ థియేటర్ వంటి అధునిక సదుపాయాలు ఉన్నాయి. వీటి సహాయంతో కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాం.

డయాలసిస్ కేంద్రాల గురించి చెప్పండి?

జిల్లాలో ప్రొద్దుటూరు, పులివెందుల సిహెచ్‌సిల్లో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. తాజాగా బద్వేల్ సిహెచ్‌సిలో డయాలసిస్ కేంద్రం ఏర్పా టు చేయడమైంది. డయాలసిస్ సేవలు అందించడం జరుగుతోంది.

సాహితీ కృషీవలుడు 'లోకనాథం'

ప్రజాశక్తి - కడప అర్బన్

మూల మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్నసాహితీవేత్తలు

ప్రముఖ పద్యకవులలో ఒకరై తనదైన మార్గంలో కవితా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ 34 రచనలు చేసిన సాహితీ కృషీవలుడు ఎం.వి.లోకనాథం అని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 147వ సదస్సులో భాగంగా 'ఎం.వి.లోకనాథం జీవితం – సాహిత్యం' కార్యక్రమం ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమం ద్వారా ప్రసిద్ధులై అందరికీ పరిచితులైన సాహితీవేత్తలే కాక మరుగునపడిన ఎంతోమంది సాహితీవేత్తలు కూడా సాహితీ ప్రేమికులకు పరిచయం అవుతుండడం సంతోషకరమన్నారు. ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎం.వి.లోకనాథం కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కొండమాచుపల్లెకు చెందిన మహాలక్షుమ్మ, రంగయ్య దంపతులకు జన్మించారన్నారు. ఆయన డైట్ కళాశాల ఉపన్యాసకులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి జిల్లా పర్యవేక్షణాధికారి, అనియతవిద్య సమన్వయకర్త, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిషత్ అధికారిగా విధులు నిర్వహించారన్నారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా విరమణ తర్వాత అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌లో (బెంగళూరు) స్పెషలిస్ట్‌గా, నెక్స్ట్ ఎడ్యుకేషన్ (హైదరాబాద్) కన్సల్టెంట్‌గా, ఎడిటోరియల్ బోర్డు మెంబర్‌గా సేవలందించారన్నారు. లోకనాథం శతక రచనలో మేటి అని, ఒక పద్యంలో మరో పద్యాన్ని గానీ, పలు పద్యాలను గానీ ఉంచి రచించే గర్భ కవిత్వంలోనూబీ పద్మం, ఖడ్గం మొదల్కెన ఆకారాల్లో పద్యాల్లోని అక్షరాలను ఒక క్రమంలో అమర్చి చెప్పే బంధకవిత్వంలోనూ దిట్ట అని అభివర్ణించారు. లోకనాథం అనేక రచనలు చేశారని పేర్కొన్నారు. ఆయన ముద్రిత రచనలను సభకు పరిచయం చేశారు. లోకనాథ రామాయణాన్ని, పలువిధాలైన శతకాలను విశ్లేషిస్తూ లోకనాథం పద్యవిద్యా పాతవాన్ని తెలియజేస్తూ అనేక పద్యాలను ఉదాహరించారు. సభను డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎం.వి.లోకనాథం, సోమకళానాథ రెడ్డి, నాగముని, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, రాజారెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, కొత్తపల్లి రామాంజనేయులు, కొండూరు జనార్ధన రాజు, గౌరిగె వెంకటేశ్వర్లు, శ్యామసుందర్ రెడ్డి, బాలరాజేశ్వర రెడ్డి, భాస్కర్ వర్మ, పార్వతి, చంద్రావతి, లక్ష్మీదేవి పేర్కొన్నారు.

చెక్కులను అందజేస్తున్న నంద్యాల కొండారెడ్డి

సిఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని పేద రోగులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని 67 మంది పేద రోగులకు రూ.53 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయ నిధికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి చొరవతో రాష్ట్రవ్యాప్తంగా సీఎం సహాయ నిధి చెక్కుల్లో ఎక్కువ మొత్తంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్న చంద్రబాబుకు ప్రజలందరూ అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, ఈవి సుధాకర్ రెడ్డి, ఎన్.హరినాథ్‌రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, కౌన్సిలర్ జిలాన్, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, వద్ది బాలుడు, బేపారి గౌస్ బాషా, జింకా రామకృష్ణ, శ్రీనివాసులరెడ్డి, సుబ్బిరెడ్డి, సిద్దయ్య, కాకుమాని ఆనంద్, చల్లా రవిశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

రైతులపై ఎరువుల భారం బాధాకరం

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచి రైతులపై భారం పెట్టడం బాధాకరమని వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రసాయనిక ఎరువుల బస్తాపై రూ.50 పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. రాష్ట్రంలో రబీ సీజన్ మొదలై వర్షాలు పడుతుంటే పంట సమయానికి రైతులపై మళ్లీ ఎరువులు రేట్లు పెంచడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపైన కపట ప్రేమ చూపిస్తున్నట్లు చెప్పారు. రైతులు పండించిన పంటలకు ఓ వైపు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే, మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచడం శోచనీయమన్నారు. పిఎం కిసాన్ డబ్బుల కోసం ప్రధాని ఇలా ప్రతిసారి ఎరువుల ధరలను పెంచడం సరికాదన్నారు. రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రులతో చర్చించి రసాయన ఎరువుల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

సౌత్‌జోన్ మహిళా కబడ్డీ జట్టుకు 'గౌతమి' విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎం రామ సుబ్బమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో విద్యార్థినులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంపికైన కబడ్డీ జట్టు చెన్నయ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో అక్టోబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. జట్టుకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో-డైరెక్టర్ శైలూష, డిప్లొమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు, ఫిజికల్ డైరెక్టర్లు ఓబయ్య, బెన్ని మార్క్స్, వివిధ విభాగ అధిపతులు యుకూబ్ అలీ, జాబీర్, విజయమ్మ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పిహెచ్‌సిలో సీమంతాలు

ప్రజాశక్తి - తొండూరు

సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పర్యవేక్షించారు. సర్పంచ్ వి.ఓబులేసు, జడ్‌పిటిసి బి.రామమునిరెడ్డి, రామసూరారెడ్డి, వి.గంగయ్య యాదవ్ పాల్గొన్నారు. వైద్య నిపుణులు పలు పరీక్షలు నిర్వహించారు. సీమంతాలు చేశారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎమిలిన్

విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని, ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని సైకాలజీ కౌన్సెలర్ డాక్టర్ ఎమిలిన్ సూచించారు. ఆదివారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఎన్ఎస్ఎస్ యూనిట్-14 ఆధ్వర్యంలో ఆత్మహత్యలు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి శారీరిక, మానసిక సమస్యలు ఉంటాయన్నారు. ఎన్ని సమస్యలున్నా డిప్రెషన్‌కు లోను కాకుండాదని విద్యార్థులకు సూచించారు. సమస్యలు ఉన్నప్పుడు స్నేహితులతో వాటిపై చర్చిస్తే పరిష్కారం దొరుకుతుందన్నారు. సమస్యలను పంచుకోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. అనంతరం డాక్టర్ ఎమిలిన్‌ని డైరెక్టర్ కుమారస్వామి గుప్తా సత్కరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్-14 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ బోల్తా : డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-తొండూరు : మండలంలోని మల్లేల గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం లారీ బోల్తా పడిన ఘటన చోటు చేసుకుంది. యర్రగుంట్ల నుంచి బెంగళూరుకు సిమెంట్ తీసుకెళ్తున్న లారీ మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన ఒరిగిపడి కరెంటు స్తంభాన్ని ఢీకొంది. అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరాను నిలిపేశారు. పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సహచర డ్రైవర్ల సాయంతో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ బోల్తా పడడం వల్ల ఆ దారిన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు, స్థానికులు చర్యలు తీసుకున్నారు. మల్లేల పరిసర ప్రాంతంలో లారీల అధికవేగంతో వస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

పొలాల మట్టి రోడ్లకు మోక్షం వచ్చేనా..?

బి.మఠం : అధ్వానంగా ఉన్న సోమిరెడ్డిపల్లె నుంచి బాట్లబావి వెళ్లు దారి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో పలు గ్రామాల పొలాలకు వెళ్లే మట్టి రోడ్లకు మోక్షమెప్పుడని రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం కొన్ని బరువులను తీసుకెళ్లాల్సి ఉంటుందని, రోడ్లు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల నుంచి పశువులకు పచ్చిమేత తీసుకురావాలంటే చాలా కష్టంగా ఉందని వాపోతున్నారు. మట్టి రోడ్లు దారుణంగా ఉండడంతో జారి కిందపడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. చెరువుల నుండి వచ్చే పిల్ల కాలువలు సరిగా లేకపోవడంతో ఆ నుండి రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం ద్వారా అయినా కాలువ పనులు, మట్టి రోడ్డు పనులు చేస్తారనుకుంటే అధికారులు పలకడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు చూసినా కొండలలో ఇంకుడు గుంతల్లాగా తీస్తున్నారు తప్ప రైతులకు ఉపయోగపడేలా పనులు చేయించడంతో ఉపాధి అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లే దారులు, కాలువలను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

చాపాడు : మండల పరిధిలోని మొర్రాయిపల్లె గ్రామం నుండి కేసి కెనాల్ కాలువ వరకు పంట పొలాలకు వెళ్లే దారి చాలా అధ్వానంగా తయారైంది. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గాన సుమారు 500 ఎకరాల వ్యవసాయ పొలాలున్నాయి. రైతులు నిత్యం ఎరువులు, కలుపులు తీసేందుకు, ఇతర వ్యవసాయ పనుల కోసం వెళ్లాల్సి ఉంటుంది. రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం వర్షాలకు మరింత గుంతలతో దారుణంగా తయారైంది. నడిచి వెళ్లాలంటే కిందపడాల్స వస్తోందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రావెల్‌తో మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. కెసి కెనాల్ అనుసంధాన రహదారుల మరమ్మతులకు అధికారులు చర్యలు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ రోడ్డుతోపాటు సిద్ధారెడ్డిపల్లె రేపల్లె, నాగాయపల్లె తదితర గ్రామాల పంట పొలాల రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. రోడ్లు అధ్వానంగా ఉండడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

చాపాడు : అధ్వానంగా ఉన్న మొర్రాయిపల్లె రోడ్డు

వర్షాలతో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయం

ప్రజాశక్తి - తొండూరు

ఉల్లి రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధరలేకపోవడం, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంట చేలోనే నానిపోతోంది. మండలంలోని తొండూరు, గంగనపల్లి పరిసరాల్లో ఉల్లి రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. చెమటోడ్చి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లే సమయానికి వరుస వర్షాలు కురవడంతో రైతుల కష్టం బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది. పంట పొలాల్లో నీరు నిలిచిపోవడంతో ఉల్లిపాయలు కుళ్లిపోతున్నాయి. ఉల్లి ధరలు కిలో రూ.4 నుంచి రూ.5కే పడిపోయాయి. రైతులకు అప్పులే మిగులుతున్నాయి. పంట పొలం నుంచి కోసుకుని మార్కెట్‌కు తీసుకెళ్తే సరైన ధర రాకపోవడం రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. మధ్యవర్తులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. అసలు చెమటోడ్చిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ఇవ్వాలని, రుణమాఫీ అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. మధ్యవర్తుల (వ్యాపారుల) దోపిడీని అరికట్టాలని సూచిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే ఉల్లిగడ్డలను కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దెబ్బతిన్న వరి పంట పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, సిపిఎం నాయకులు సత్యనారాయణ కోరారు. ఆదివారం ప్రొద్దుటూరు మండలంలో నీట మునిగిన పంట పొలాలను వారు పరిశీలించారు. నాలుగు రోజులుగా ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల్లో భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయన్నారు. ప్రొద్దుటూరు రూరల్ ప్రాంతంలో పర్లపాడు, రాజుపాలెం ప్రాంతాల్లో వరి, పత్తి, కంది ఇతర పంటలు నీట మునిగాయ వివరించారు. కొన్ని ప్రాంతాల్లో భూములు కోతకు గురయ్యాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు రబీ సీజన్లో విత్తనాలు, ఎరువులు, మందులు 90 శాతం రాయితీతో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మరో ప్రొద్దుటూరులో ఎరువులు, మందులు, నాసిరకం విత్తనాలను అధిక ధరలతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ యువజన సంఘం పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, బాధిత రైతులు రామాంజనేయులురెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడలు అందరికీ ఆదర్శం

గురజాడ చిత్రపటానికి నివాళ్ళుర్పిస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని, ఆయన అడుగుజాడలు అందరికీ ఆదర్శనీయమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలో గురజాడ 163వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అనే అమర సందేశాన్ని సమాజానికి అందించిన దేశభక్తుడు, సంఘసంస్కర్త గురజాడ అని కొనియాడారు. స్త్రీ జనోద్ధరణ, సంఘసంస్కరణ, భాషోద్యమం ఈ మూడింటిని సమానంగా నడిపించిన మార్గదర్శి గురజాడ అన్నారు. నాటి సమాజం మీద గురజాడ విసిరిన సాహితీ బ్రహ్మాస్త్రం కన్యాశుల్కం నాటకమన్నారు. గిరీశం, బుచ్చమ్మ ,మధురవాణి తెలుగు నాటకంలో సజీవ పాత్రలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురజాడ చిత్ర పటానికి ప్రిన్సిపల్ నాగేంద్ర నివాళులర్పించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు నర్రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌బిఐ రిటైర్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, వేమారాజా, ఐచర్ రమణ, బండారు వెంకటేశు, రామసుబ్బారెడ్డి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు బాలకొండ గంగాధర్, నాగలక్ష్మి దేవి, మాధవరావు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా అన్న మహాకవి గురజాడ అప్పారావు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని బండి ఆత్మకూరు మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జి పర్యవేక్షణలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అమీర్, డాక్టర్ నరసింహులు, బాబా పక్రుద్దీన్, మధు పాల్గొన్నారు.

వేగవంతంగా గండి కొవ్వూరు హై లెవెల్ బ్రిడ్జి పనులు

ప్రజాశక్తి - చక్రాయపేట

పాపాగ్ని నదిలో పిల్లర్లు పూర్తయిన బ్రిడ్జి

మండలంలోని కుమారకాల్వ-గండి కొవ్వూరు హై లెవెల్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరికి పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. పాపాగ్ని నది ఒడ్డున ఉన్న గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చక్రాయపేట మండల కేంద్రం రావాలంటే అద్దాలమర్రి, కొండవాండ్లపల్లి, మారెళ్ళమడక మీదుగా దాదాపు 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి. ఈ బ్రిడ్జి పూర్తయితే కేవలం 4 కిలోమీటర్లలో మండల కేంద్రానికి చేరుకోవచ్చునన్నారు. ఇక్కడ అప్పట్లో బ్రిడ్జి నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి హయాంలో వారి కుమారుడు మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ప్రతిపాదనలు పెట్టారు. అయితే అప్పట్లో మాజీ మంత్రి రాజగోపాల్ రెడ్డి అద్దాలమర్రి గ్రామస్తులకు మాట ఇచ్చారని అద్దాలమర్రి క్రాస్ వద్ద నిర్మించడం జరిగిందని ప్రజలు అంటున్నారు. ఇటీవల ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద దాదాపు రూ.28 కోట్లతో బ్రిడ్జి మంజూరైంది. ఈ పనులను ఎంపీ సీఎం రమేష్‌నాయుడు కంపెనీ దక్కించుకుంది. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వీరు గతంలో అక్కడక్కడ పనులు చేసినప్పటికీ త్వరితగితన పనులు పూర్తి చేసి అవార్డు పొందినట్లు తెలిసింది. ఈ బ్రిడ్జి పనులు కూడా సమయానికంటే ముందు పూర్తి చేసి అవార్డు పొందాలనే విషయం విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే దాదాపు 28 పిల్లర్లు పూర్తయ్యాయి. సాయి నాయుడు అనే సబ్ కాంట్రాక్టర్లు అక్కడ ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే చక్రాయపేట నుండి గండికోవూరు, వెన్నపల్లె మీదుగా తలుపుల, కదిరి, అనంతపురం వెళ్లడానికి దాదాపు పది కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని పాపాగ్ని ఒడ్డున ఉన్న గ్రామ ప్రజలు చక్రాయపేట మండల కేంద్రం కార్యాలయం వద్దకు రావడానికి సులభంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోడపత్రాలు విడుదల చేస్తున్న వివిధ సంఘాల నేతలు

బలవంతపు భూసేకరణ రద్దు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బలవంతపు భూసేకరణ రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఈశ్వర్‌రెడ్డి సర్కిల్‌లో ఆదివారం చలో విజయవాడ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలో పెద్దముడియం, మైలవరం మండలాల్లో సోలార్ ప్రాజెక్టుకు రైతుల దగ్గర నుండి బలవంతపు భూసేకరణను రద్దు చేయాలని ఈనెల 24న చలో విజయవాడ మహా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని కల్వటాల, గోవిందపల్లి, వద్దిరాల తదితర గ్రామాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ యాజమాన్యం రైతుల దగ్గర బలవంతపు సేకరణ చేయడం, భూములు ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. లీజు పేరుతో రైతుల దగ్గర తీసుకున్న భూములు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండా రాత్రి సమయాల్లో గుంతలు తీసి స్తంభాలు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. మహాధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున సోలార్ బాధితులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, నాయకులు నూర్‌బాషా, ప్రసాద్, ఆది, హరి, రవి పాల్గొన్నారు.

ఇంట్లోని బురద నీటిని ఎత్తిపోసుకుంటున్న మహిళలు

ఇళ్లల్లోకి వర్షపునీరు.. పాడైన వస్తువులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు అటు రైతులు, ఇటు నివాసులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాజుపాలెం మండలం అరకటవేముల గ్రామానికి చెందిన సురేష్ ఇంట్లోకి వర్షపునీరు చేరింది. మోకాల్లోతు నీటిలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ మేరకు బాధితులు వాపోయారు. బురద నీరు ఇంటిలోకి వచ్చి చేరిందన్నారు. బియ్యం బస్తాలతో సహా నిత్యావసర సరుకులు మొత్తం నీటిలో మునిగిపోయాయి. ఇంటి సామాన్లు కూడా కొట్టుకుపోయాయని వాపోయారు. ఇద్దరు బాలింతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని సురేష్ కోరుతన్నారు.

మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ఆర్యవైశ్య సభ ప్రతినిధులు

దసరా ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరులో అత్యంత వైభవంగా జరగనున్న దసరా ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డిని ఆదివారం ఆర్యవైశ్య సభ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బళ్లాని చెన్నకేశవ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం పది రోజులపాటు దసరా ఉత్సవాలను నిర్వహించేవారమని, ఈ ఏడాది సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యేను వారు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పబ్బుతి గోపాల్, దొంతు వెంకట సుబ్బయ్య, సెక్రటరి కోటా అశోక్‌కుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

షర్మిలను మర్యాద పూర్వకంగా కలిసిన ధృవకుమార్ రెడ్డి

పులివెందులలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని పిసిసి ఛీఫ్ షర్మిల సూచించారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఉన్న ఆమెను ఆదివారం పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధృవకుమార్‌రెడ్డి కలిశారు. పులివెందుల సమస్యలపై, కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై వారు చర్చించారు. కూటమి ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని షర్మిలా పేర్కొన్నారు. మరింత గట్టిగా పోరాటం చేసి కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు అకర్షణయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజల పక్షాన నిలపడి సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. ఎఐసిసి పిలుపుమేరకు ఓట్ చోరీ కార్యక్రమానికి సంబంధించి పులివెందుల నియోజకవర్గంలో సంతకాల సేకరణ చేపట్టాలని కోరారు. రాహుల్ గాంధీకి మద్దతుగా ఓట్ చోరీ కార్యక్రమం జిల్లాలో కూడా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారందరిని కలుపుకొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

విషాదంగా ముగిసిన కిడ్నాప్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రొద్దుటూరులో సంచలనం రేకెత్తించిన వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి కిడ్నాప్ వ్యవహారం విషాదంగా ముగిసింది. శుక్రవారం రాత్రి బొల్లవరం సమీపంలో కిడ్నాప్‌నకు గురైన వేణుగోపాల్‌రెడ్డి మృతదేహం ఆదివారం ఉదయం మండలంలోని కామనూరు సమీపంలో కుందూ నది వద్ద పోలీసులు వెలికి తీశారు. రూరల్ పోలీసుల సమాచారం మేరకు అగ్ని మాపక సిబ్బంది పవర్ బోర్డ్‌లో మృతదేహాన్ని వెలికితీశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ప్రజాశక్తి - వల్లూరు

ఆదినిమ్మాయపల్లి గ్రామంలో విద్యుదాఘంతో ఆదివారం గేదె మృతి చెందింది. హనుమంతు అనే పాడి రైతు మేత కోసం గేదెను పొలానికి తోలుకపోతుండగా పొలిమేరలో ఉన్న నీటి తొట్టిలో నీరు తాగడానికి వెళ్లిన గేదెకు విద్యుత్ లైన్ తగిలి మృతి చెందింది. గేదె విలువ దాదాపు రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడ. విద్యుత్ అధికారులు అప్పుడప్పుడు లైన్లను పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు సూచిస్తున్నారు. అధికారులు స్పదించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.